ప్రణాళికలో ఆకలి మరిచారు

- మార్చి 15 నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు
- ప్రభుత్వ బడుల్లో నూరు శాతం ఉత్తీర్ణతకు 100 రోజుల ప్రణాళిక
- విద్యార్థులకు ఉదయం, సాయంత్రం అదనపు తరగతులు
- సమయానికి భోజనం అందించలేకున్న తల్లిదండ్రులు
- అల్పాహారం అందక అర్ధాకలితో చదువులు
- విద్యార్థుల ఇబ్బందులు పట్టించుకోని ప్రభుత్వం
- నియోజకవర్గంలో 2,651 మంది పరీక్షలకు సన్నద్ధం..



పట్టణంలోని సుగాలి కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణ లో ప్రత్యేక తరగతిలో టెన్త్ విద్యార్థులు

సత్తెనపల్లి: పదతో తరగతి పరీక్షలు దగ్గరకొచ్చే శాయి. ప్రభుత్వ బడుల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించేందుకు సర్కార్ వంద రోజుల ప్రణాళిక రూపొంచింది. డిసెంబరు ఒకటవ తేదీ నుంచి పరీక్షల సన్నద్ధతకు అదనపు తరగతులు నిర్వహిస్తోంది. దీంతో విద్యార్థులు ఉదయం 8 గంటల్లా పాఠశాలకు చేరుకునేందుకు.. 6 గంటలకే తయారై ఇంటి నుంచి బయలుదేరుతున్నారు. అధికశాతం ఇతర ఇతర గ్రామాలు, దూర ప్రాంతాల నుంచి విద్యార్థులు బడికొస్తుంటారు. దీంతో ఆ సమయానికి తల్లిదండ్రులు అల్పాహారం అందించ లేకున్నారు. వారు కూడా కూలి పనులకు హడావుడిగా వెళ్లిపోతున్నారు. పరీక్షల సన్నద్ధతలో పడి పదో తరగతి విద్యార్థులు అర్ధకాలితో యుద్ధం చేస్తున్నారు. సమయానికి తిండి తినక చదువుపై పూర్తి స్థాయిలో దృష్టిసారించలేక పోతున్నారు. ఉత్తీర్ణతపై దృష్టి సారించిన ప్రభుత్వం..విద్యార్థుల ఆకలిని కూడా అర్థం చేసుకుంటే బాగుంటుందని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సత్తెనపల్లి నియోజకవర్గంలో

సత్తెనపల్లి నియోజకవర్గంలో 32 జిల్లా పరిషత్, 4 కేజీబీవీ, రెండు గురుకులాలు, ఒక మోడల్ పాఠశాల ఉంది. వాటిలో పదో తరగతి విద్యార్థులు 2,651 మంది ఉన్నారు. మార్చి 15 నుంచి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో పాఠశాలల్లో ప్రత్యేక పునశ్చరణ తరగతులు, సబ్జెక్టు నిపుణుల రూపొందించిన ప్రశ్న పత్రాలతో నమూనా పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలకు వచ్చేవారిలో ఎక్కువ మంది పేద విద్యార్థులు, దూర ప్రాంతాల వారే ఉన్నారు. వీరు పాఠశాలలకు బస్సులు, సైకిళ్లపై చేరుకుంటారు. వీరు ఉదయం తొందరగా నిద్ర లేచి పాఠశాలలకు బయలు దేరుతున్నారు. ఆ సమయంలో ఇంటి వద్ద ఏమి తినకుండా వస్తున్నారు. సాయంత్రం కూడా పాఠశాల నుంచి ఇంటికి ఆలస్యంగా చేరుకోవడంతో ఆకలితో నిరసించిపోతున్నారు.

వంద రోజుల ప్రణాళిక

నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలో టెన్త్ విద్యార్థులు		
మండలం	పాఠశాలలు	విద్యార్థులు
సత్తెనపల్లి	17	1,398
ముప్పాళ్ళ	06	343
రాజుపాలెం	07	391
నకరికల్లు	09	519
మొత్తం	39	2,651

ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది నూరు శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా విద్యాశాఖ 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. గతేఏడాది డిసెంబర్ ఒకటి నుంచి దీనిని అమలు చేస్తోంది. నెల రోజులుగా పాఠశాలల్లో అదనపు తరగతుల నిర్వహిస్తోంది. దీంతో తినీతినక ఉదయం 8 గంటలకే పాఠశాలలకు పదో తరగతి విద్యార్థులు చేరుకుంటున్నారు. మధ్యాహ్నం పాఠశాలల్లో భోజనం చేస్తున్నా.. సాయంత్రం ఐదు గంటల వరకు తరగతులు ఉండటంతో ఆకలితో ఇబ్బంది పడుతున్నారు. చదువుపై దృష్టి సారించలేకపోతున్నారు.

దాతలు స్పందించాలి..

కొంతమంది విద్యార్థులు బయట దుకాణాల వద్ద అల్పాహారం తింటున్నా ... డబ్బులు లేని వారు ఆకలితో ఉంటున్నారు. కేజీబీవీ, గురుకులాల్లో ఉదయం అల్పాహారం అందిస్తున్నారు. కానీ, సాయంత్రం ఉండడం లేదు. పబ్లిక్ పరీక్షలకు ఇంకా రెండు నెలలు సమయం ఉన్న నేపథ్యంలో దాతలు ముందుకు వచ్చి పదోతరగతి విద్యార్థులకు అల్పాహారం అందించాలని పలువురు కోరుతున్నారు.

క్లుప్తంగా

పాఠశాలల బలోపేతంపై శిక్షణ



సత్తెనపల్లి: పాఠశాలల బలోపేతంపై మండల స్థాయిలో ప్రధానోపాధ్యాయులు, స్కూల్ చైర్మన్లకు పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో గురువారం శిక్షణ ఇచ్చారు. పాఠశాల యాజమాన్య కమిటీ విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. కోర్సు డైరెక్టర్లుగా ఎంఈఓలు ఎ.శ్రీనివాసరావు, ఎ. రాఘవేంద్రరావు వ్యవహరించారు. రిసోర్స్ పర్సన్లుగా షేక్ సాయిబాబు, కె. సురేష్, వెంకయ్య, టి.రాజు, షేక్ హఫీజ్ ఉన్నారు. 130 మంది హెచ్ఎంలు, చైర్మన్లు హాజరయ్యారు.

ఐఏఎల్ 2025 కోర్టు డైరీ ఆవిష్కరణ



సత్తెనపల్లి: పట్టణంలోని తాలూకా కోర్టు ప్రాంగణంలో న్యాయ దేవత విగ్రహం వద్ద ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐఏఎల్)-2025 కోర్టు డైరీని గురువారం ఆవిష్కరించారు. ఐఏఎల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నరిశేటి వేణుగోపాల్ డైరీని ఆవిష్కరించి, న్యాయవాదులకు పంపిణీ చేశారు. సీనియర్ న్యాయవాదులు పీవీఎస్ఎస్ శాస్త్రి, బీఎల్ చిన్నయ్య, కళ్లం వీర భాస్కరరెడ్డి, పాటిబండ్ల రవి, వి.పాపారావు, బత్తిన శ్రీనివాసబాబు, జూపల్లి శేషయ్య, జె.విజయ్‌కుమార్, కొల్లా వెంకటేశ్వరరావు, చెవల బాలకోటయ్య, జానీ ఖాజావలి, ఆర్‌జీకేఎం మూర్తి, బాబూరావు, హరిబాబు, తవ్వా హరినాథ్, రాజవరపు నరశింహరావు, ఏడుకొండలు, క్రిష్టారెడ్డి, కిరణ్ కింగ్, బొక్కా సంగీతరావు, గుజ్జర్ల పూడి సురేష్,హరీష్, లక్ష్మణ్, గుమాస్తాలు పాల్గొన్నారు.

వాసవి మణికంఠ క్లబ్ అధ్యక్షుడిగా కొప్పురావూరి



సత్తెనపల్లి: వాసవి మణికంఠ క్లబ్ నూతన అధ్యక్షుడిగా కొప్పురావూరి కాశీ వెంకట సుబ్బారావు నియమితులయ్యారు. వీ204-ఏ వాసవి మణికంఠ క్లబ్ అధ్యక్షుడు వనమా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో 2025 సంవత్సరానికి నూతన కమిటీని నియమించారు. క్లబ్ సెక్రటరీగా సూరే శ్రీనివాసరావు, ట్రెజరర్‌గా దేవరపల్లి కాశీ విశ్వేశ్వరరావు, జాయింట్ సెక్రటరీగా అనుమాలశెట్టి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా పెండ్యాల సాంబశివరావుతో 1010 ఫాంను డిస్ట్రిక్ గవర్నర్ మునగాల చిరంజీవికి గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ సెక్రటరీ పోతుగంటి రమేష్, ట్రెజరర్ వెల్లంపల్లి కేశవరావు, పోతుగంటి నరసింహారావు, ఆతుకూరి వెంకటహరేరామ చెంచయ్య పాల్గొన్నారు.

బొల్లవరంలో రెవెన్యూ సదస్సు



బొల్లవరం(ముప్పాళ్ళ): మండలంలోని బొల్లవరం గ్రామంలో రెవెన్యూ సదస్సు గురువారం జరిగింది. సదస్సులో తహసీల్దార్ ఎం.భవానిశంకర్ పాల్గొని అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ, కొత్త రేషన్ కార్డుల కోసం, కొత్త పింఛన్‌ల కోసం 31 అర్జీలు అందినట్లు తహసీల్దార్ తెలిపారు. సర్పంచ్ బద్దిగం పూజితారెడ్డి, ఎంపీటీసీ వీరభాస్కరరెడ్డి, సర్వేయర్ టి.సుధాకర్, వీఆర్వో సంజీవరావు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు స్పందన కరువు

అచ్చంపేట: మండలంలోని కస్తలలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దారు జి.శ్రీనివాసయాదవ్‌తో కలసి రెవెన్యూ సిబ్బంది ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కూర్చున్నా కేవలం 5 సమస్యలపై మాత్రమే ఫిర్యాదులు వచ్చాయి. అవి కూడా వెంటనే పరిష్కరించలేని సమస్యలు కావడం గమనార్హం. ముఖ్యంగా ఎన్నో ఏళ్లుగా అనుభవిస్తున్న లంక భూములకు పట్టాదారు పాసుపుస్తకాలు, ధరఖాస్తు చేసుకుని మూడు, నాలుగు నెలలు కావస్తున్న పాసుపుస్తకాలు రానివారి ఫిర్యాదులే. గ్రామ సర్పంచ్ షేక్ మాబూ సుభాని, సర్వేయర్ ఏడుకొండలు, వీఆర్వో కృష్ణ పాల్గొన్నారు.



కంకణాలపల్లిలో రీ-సర్వే పున:ప్రారంభం



సత్తెనపల్లి: భూముల రీ సర్వే కంకణాలపల్లి గ్రామంలో గురువారం పున:ప్రారంభమైంది. ఇద్దరు సర్వేయర్లు, వీఆర్‌ఓ, వీఆర్‌ఏ బృందంగా.. మూడు బృందాలు 123 మంది రైతులకు చెందిన 25 సర్వే నంబర్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రోటవేటర్ ద్వారా భూమిపై నిజ నిర్ధారణకు పరిశీలన చేసి, గుర్తించారు. ఆ భూమిపై యాజమాన్య హక్కుల మేరకు పాస్ పుస్తకాల్లో విస్తీర్ణం నమోదై ఉందో లేదో పరిశీలించి, పత్రాలను నిర్ధారించారు.

వైభవంగా సీతారావమ్మ మాతాజీ ఆరాధన



బెల్లంకొండ: మండలంలోని వెంకటాయపాలెం శ్రీ కొండ శింగరేశ్వర స్వామి ఆశ్రమంలో మాతాజీ సీతారావమ్మ 9వ ఆరాధన గురువారం గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. 2017 జనవరి 2న అకాల మరణం చెందిన సీతారావమ్మ మాతాజీని స్మరించుకున్నారు. వేకువ జామున మాతాజీ ఆశీనురాలైన పవిత్ర స్థలంలో ప్రత్యేక అలంకరణలు చేశారు. భక్తులు తరలివచ్చారు. భజన బృందం పాటలు భక్తులను అలరించాయి. అన్నదానం చేశారు. జెండా ఊరేగింపు నిర్వహించారు.




ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

ఐ లవ్ సత్తెనపల్లి..!

సుందరీకరణలో భాగంగా పట్టణంలోని తాలూకా సెంటర్‌లో రూ.15 లక్షలు మున్సిపల్ నిధులతో 'ఐ లవ్ సత్తెనపల్లి' అక్రిలిక్ త్రీడీ ఇంగ్లీష్ అక్షరాలను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ గురువారం ప్రారంభించారు. ఆ ప్రాంతంలోని విగ్రహాల వద్ద పచ్చదనం ఏర్పాటు చేశారు. టీడీపీ నాయకులు దరువూరి నాగేశ్వరరావు, సయ్యద్ పెద్దకరీ ముల్లా, ఆతుకూరి నాగేశ్వర రావు, జాన్ బాబు, కమిషనర్ కొలిమి షమ్మి ఉన్నారు.

– సత్తెనపల్లి



అక్రిలిక్ త్రీడి ఐ లవ్ సత్తెనపల్లి అక్షరాలు

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి



అమరావతి: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతానికి సహాయ సహకారాలు అందించాలని ఎంఈఓ సీహెచ్ శివబాబు అన్నారు. శుక్రవారం అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించిన స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్, ప్రధానోపాధ్యాయులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో అయన పాల్గొని మాట్లాడారు. ఎంఈఓ మాట్లాడుతూ బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించాలని, పాఠశాలలను నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతంపై స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్, ప్రధానోపాధ్యాయులకు షేక్ కాలేషావలి, విప్పర్ల అరుణ రావు, పి.హనుమంత రావు రిసోర్స్ పర్సన్స్‌గా శిక్షణ ఇచ్చారు. ఎస్ఎంసీ చైర్మన్లు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

సత్తెనపల్లి: నియోజకవర్గంలో వివిధ రుగ్మతలతో బాధపడుతున్న వారికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పట్టణంలోని రఘురామ్‌నగర్‌లో గురువారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పంపిణీ చేశారు. రాజుపాలెం మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన పోలిపోయిన బ్రహ్మంకి రూ. 2,48,574, మొక్కపాడు గ్రామానికి చెందిన కన్నదం వెంకటశివకు మారికి రూ.1.80 లక్షలు, నెమలిపురి గ్రామానికి చెందిన బెల్లం కొండ అన్నపూర్ణమ్మకి రూ.1.80 లక్షలు, సత్తెనపల్లి మండలం బృగుబండ గ్రామానికి చెందిన అన్నదాసు వెంకటేశ్వర్లుకి రూ.2 లక్షలు, గొల్లపల్లి శ్రీలక్ష్మీకి రూ.లక్ష, జక్కా లక్ష్మీకి రూ.90 వేలు, ఇనుకొల్లు సీతారావమ్మకి రూ.1.80 లక్షలు, అబ్బురు గ్రామానికి చెందిన మానుకొండ భూపాయరావు కి రూ.1.21 లక్షలు, సత్తెనపల్లి పట్టణానికి చెందిన అట్లూరి వెంకటేశ్వర్లుకి రూ.51,310 ల చెక్కులను పంపిణీ చేశారు. మాజీ ఏఎంసీ చైర్మన్ మక్కపాటి రామచంద్రరావు, నాయకులు ఉన్నారు.

పేకాట స్థావరాలపై దాడి

పిడుగురాళ్ల: మండలంలోని జూలకల్లు గ్రామ శివారు ప్రాంతాల్లో గురువారం పేకాట స్థావరాలపై పట్టణ పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. కంది పొలాల్లో పేకాట ఆడుతున్న సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఆరుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.64,070 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ మోహన్ తెలిపారు.

ఏరియా వైద్యశాల అభివృద్ధికి కృషి

సత్తెనపల్లి: రానున్న రోజుల్లో సత్తెనపల్లి ప్రభుత్వ ఏరియా వైద్యశాలను మరింత అభివృద్ధి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. ఏరియా వైద్యశాలలో గురువారం వైద్యశాల నూతన అభివృద్ధి కమిటీ ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పేదలకు అండగా ఎల్లప్పుడూ ప్రభుత్వ సహకారం ఉంటుందన్నారు. ప్రభుత్వ ఏరియా వైద్యశాల సిబ్బందికి నూతన అభివృద్ధి కమిటీ సభ్యులు సహకరించాలని, ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని కోరారు. ప్రభుత్వ ఏరియా వైద్యశాల చైర్మన్‌గా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, కన్వీనర్‌గా వైద్యశాల సూప రిండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు, సభ్యులుగా ఎంపీ లావు శ్రీకృష్ణదేవ రాయలు, జవ్వాజి రామ్మోహహన్‌రావు(వ్యాపారి), సిరిగిరి.మణికంఠ (పీఆర్వో), మారెళ్ల వీరాంజనేయులు (ఆర్ఎంపీ), యెల్లినేడి లక్ష్మీతులసి(పట్టణ మహిళా సొసైటీ), డాక్టర్ పోట్ల.అరుణకుమారి (ఐఎంఏ) జీవీ. రమణకాంత్‌రెడ్డి (ఆర్డీవో), కొలిమి.షమ్మి (మున్సిపల్ కమిషనర్) నియమితులు కాగా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మినహా మిగిలిన వారంతా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారాయణను వైద్యశాల సూపరిండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు, వైద్యశాల సిబ్బంది పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, అధికారులు, తదితరులు ఉన్నారు.



ప్రమాణస్వీకారం చేసిన అభివృద్ధి కమిటీతో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారాయణ

సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలి

సత్తెనపల్లి: విద్యార్థినులు సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలని వసతిగృహ సంక్షేమ అధికారి పి.సుమని అన్నారు. వెంకటపతి నగర్‌లోని సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల బాలికల వసతి గృహంలో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వారోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుమని మాట్లాడుతూ తెగువ, పట్టుదల, సంకల్ప బలం ఉన్న సావిత్రిబాయి పూలేని 193 సంవత్సరాల తర్వాత కూడా గుర్తు చేసుకుంటున్నామంటే ఆమె త్యాగ నిబద్ధత కారణమన్నారు. ఆమెను ఆదర్శంగా తీసుకొని ప్రతి విద్యార్థిని జీవితంలో స్థిర పడి, సమాజం పట్ల బాధ్యత కలిగి ఉండాలన్నారు. హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు మాట్లాడుతూ మహిళలు, బాలికలు అనేక రంగాల్లో స్వేచ్ఛగా ముందుకు వెళ్తున్నారంటే దానికి కారణం సావిత్రిబాయి పూలే కృషి ఎంతో ఉందన్నారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సుమనీని ఫౌండేషన్ బాధ్యులు ఘనంగా సత్కరించారు. ఫౌండేషన్ కో-ఆర్డి నేటర్ శ్రీలత పాల్గొన్నారు.



సావిత్రిబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారిణి సుమని, విద్యార్థినులు

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

సత్తెనపల్లి: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సుగాలి కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లతా ప్రియదర్శిని అన్నారు. పాఠశాలకు రూ. 20 వేలు విలువచేసే క్రీడా సామగ్రిని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, నాయకులు చౌటా శ్రీనివాస రావు, కౌన్సిలర్ సుజాత, వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యులు మారెళ్ళ వీరాంజనేయులు, ఎస్ఎంసీ కమిటీ సభ్యులు నాగుల్ మీరా, ఆశీర్వాదం, పురుషోత్తం నాయక్, రిటైర్డ హెచ్ఎం వెంటాద్రి అందజేశారు. గురువారం క్రీడాకారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు లతా ప్రియదర్శిని మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రీడల్లో రాణించాలన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించడం వల్ల భవిష్యత్తులో మంచి ప్రయోజకులుగా తీర్చిదిద్దబడతారన్నారు. ఈ సందర్భంగా దాతలు అందించిన క్రీడా సామగ్రిని సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. పాఠశాల పీడీలు రియాజ్, నరసింహారావు, సుధారాణి, వెంకటేశు, కోటేశ్వ రరావు, ప్రసాద్, క్రీడాకారులు ఉన్నారు.



క్రీడా సామగ్రి పంపిణీ చేస్తున్న హెచ్ఎం లతా ప్రియదర్శిని

నేడు మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్

పిడుగురాళ్ల: స్కాలర్ డిగ్రీ కాలేజీ సమీపంలో మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు క్రెజీ బాయ్స్ జాని, సన్నీ గురువారం తెలిపారు. కన్నెగంటి భార్గవనాయుడు జ్ఞాపకార్థం పిడుగురాళ్ల ప్రీమియమ్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటి రూ.22,222, ద్వితీయ రూ.17,777, తృతీయ బహుమతి రూ.12,222గా తెలిపారు.

దివ్యమనోహరం శ్రీవారి దర్శనం







సత్తెనపల్లి: ధనుర్మాసం పురస్కరించుకొని రైల్వే స్టేషన్ రోడ్డులో ఉన్న అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయంలో గురువారం శ్రీవారికి దివ్య మనోహర రూపా స్వామిగా అలంకరించి, పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆలయ శ్రీవారి సేవా సమాజం ఏర్పాట్లను పర్యవేక్షించింది.

గోదాదేవికి 108 ప్రసాదాల నైవేద్యం

సత్తెనపల్లి: ధనుర్మాసం పురస్కరించుకొని వడ్డవల్లి శ్రీరామాలయం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవారిని నిజపాద దర్శనంలో భక్తులు దర్శించుకుని, పూజించారు. గోదాదేవికి 108 రకాల ప్రసాదాలతో నైవేద్యం సమర్పించారు.

వామనావతార.. శ్రీరామచంద్ర

అచ్చంపేట: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలందుకున్న సీతా సమేత శ్రీరామచంద్రునికి గురువారం అచ్చంపేటలో గ్రామోత్సవం నిర్వహించారు. స్వామివారిని దశావతారాల్లో ముఖ్యమైన వామనునిగా ఆలంకరించి, ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆర్యవైశ్య మహిళా విభాగం అమ్మవారి సహస్ర, అష్టోత్తర శతనామార్చన పారాయణ పఠించింది. పలు గ్రామాల భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

పాఠశాలల అభివృద్ధికి పాటుపడాలి



శిక్షణలో మాట్లాడుతున్న ఎంఈవో, పీఆర్‌పీలు



మాట్లాడుతున్న ఉప విద్యాశాఖాధికారి వి.ఏసుబాబు

రాజుపాలెం: పాఠశాలల అభివృద్ధిలో పాఠశాల కమిటీ చైర్మన్, సభ్యులు భాగస్వాములు కావాలని ఎంఈవో-1 మల్లికార్జునశర్మ తెలిపారు. రాజుపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో ఎస్ఎంసీ చైర్మన్లకు, ప్రధానోపాధ్యాయులకు పాఠశాలల అభివృద్ధిపై శిక్షణా గురువారం జరిగింది. పీఆర్పీలుగా రాము, నేతాజీ వ్యవహరించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 నరసింహారావు, సీఆర్పీ కోటేశ్వరరావు, ఎమ్ఐఎస్ కో-ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, 55 పాఠశాలల చైర్మన్లు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి

నకరికల్లు: పాఠశాలల అభివృద్ధిలో ఎస్ఎంసీ సభ్యుల పాత్ర కీలకమైందని సత్తెనపల్లి ఉప విద్యాశాఖాధికారి వి.ఏసుబాబు తెలిపారు. పాఠశాల యాజమాన్యక మిటీ చైర్మన్లకు, ప్రధానోపాధ్యాయులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించారు. రిసోర్స్ పర్సన్‌గా కండ్లకుంట ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.వి.ఎల్.ఏ.వరప్రసాద్ వ్యవహరించారు. సుకుమార్, సుబ్బారావు, ఎస్ఎంసీ చైర్మన్‌లు కె.మల్లికార్జునరావు, పి.గాంధీ, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ బత్తిన మల్లికార్జునరావు పాల్గొన్నారు.